# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతితో పాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ఉగాది పండుగ సందర్భంగా పేదలకు ఆర్థిక సాయం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు.**

3. **మూలపేట పోర్టు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

4. **రాష్ట్రంలో 10 వేల 60 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు.**

5. **రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ నిర్వహిస్తున్న జ్ఞానభూమి పోర్టల్ కు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది.**

==========================

అమరావతితో పాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాడుగుల నాగఫణి శర్మ పంచాంగాన్ని పఠించగా, ముఖ్యమంత్రి, మంత్రులు, సభికులు శ్రవణం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం మొబైల్ నుంచి పాలన సాగించే రోజులు వచ్చాయన్నారు. ఎఐ, క్వాంటం కంప్యూటింగ్ కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. 2047కి తెలుగు జాతి ప్రపంచంలో ముందంజలో ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేస్తూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఉగాది పండుగ సందర్భంగా పేదలకు ఆర్థిక సాయం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లిలో ఉన్న ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల సందర్భంగా 6 వేల 787 మందికి ఆర్థిక సాయం అందించేందుకు 55 కోట్ల 63 లక్షల రూపాయలను విడుదల చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై ఆయన ఈ రోజు సంతకం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు సాయం చేసే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల్లో ఆర్థిక సాయం, వైద్య సాయం, లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద వెయ్యి 241 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. 21 నెలల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 1 లక్షా 36 వేల 240 మందికి సాయం అదించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తిరుమల తిరుపతి దేవస్థానం, దుర్గగుడి అర్చకులు ఆశీర్వచనం అందించారు.

---------------------------

మూలపేట పోర్టు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పోర్టు నిర్మాణానికి ఉప్పు భూములు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వడం శుభపరిణామనని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో 10 వేల 60 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఉగాది కానుకగా ఉద్యోగాల పండగను ప్రకటిస్తున్నట్లు మంత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. వివిధ శాఖల్లో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలను వెల్లడించారు. విద్యా, హోం, ఇంజనీరింగ్ శాఖలు, గ్రూప్ 1, గ్రూప్ 2 విభాగాల్లో 10 వేల 60 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే విషయాలను జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలోనే పరీక్షలు నిర్వహించి ప్రకటించిన అన్ని పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు పురస్కారాలను అందజేశారు. ప్రతిష్టాత్మకమైన 'కళారత్న' అవార్డులను 38 మందికి అందజేయగా, ఉగాది విశిష్ట పురస్కారాలను వివిధ రంగాలకు చెందిన మరో 122 మందికి అందజేశారు. సాహిత్యం విభాగంలో గతంలో ఆకాశవాణిలో పని చేసిన ఆర్.ఎ. పద్మనాభం, రొక్కం కామేశ్వరరావు, కళారత్న అవార్డులను ముఖ్యమంత్రి నుంచి అందుకున్నారు. జర్నలిజం విభాగంలో జి. కొండలరావు, వలేటి గోపిచంద్ లతో పాటు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ప్రస్తుతం కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చుండూరు మాణిక్యరావులు ఉగాది పురస్కారాలు ముఖ్యమంత్రి నుంచి అందుకున్నారు.

---------------------------

వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ అకడమిక్ కేలండర్‌ను బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా నిన్న విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని ఈ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 24 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు పునఃప్రారంభం అవుతాయని వెల్లడించారు. అక్టోబరు 10 నుంచి 20వ తేదీ వరకు దసరా 2026, జనవరి 2027 9 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని వెల్లడించారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరిలో, పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి, మార్చిలో ఉంటాయని తెలిపారు. కళాశాలలకు మొత్తం 232 పనిదినాలు ఉంటాయని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో భవన ఇతర నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్హులైన వారికి ప్రయోజనం అందించేందుకు మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కార్మిక శాఖ కార్యదర్శి ఎం.వి శేషగిరి బాబు నిన్న జారీ చేశారు. వివాహ కానుక, ప్రసూతి ప్రయోజనం, సహజ మరణ పరిహార పథకం, అంత్యక్రియల ఖర్చులకు సంబంధించి ఈ ఏడాది మార్చి 1వ తేదీ అనంతరం సంభవించిన ఘటనలకు వర్తించేలా ఎపి సేవా పోర్టల్ ద్వారా వినతులను స్వీకరించాలని ఎం.వి శేషగిరి బాబు అధికారులను ఆదేశించారు.

---------------------------

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈ రోజు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి దంపతులు ఈ వేడుకలను ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అంనంతరం పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి పంచాంగ పఠనం చేశారు. పంచాంగ శ్రవణం అనంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి దంపతులకు పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం 3.1 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని, గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి దక్షిణ అంతర కర్ణాటక వరకు తమిళనాడు అంతర్భాగంగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావారణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్ర అధికారి జి.లక్ష్మీ వెల్లడిస్తూ...

..వాయిస్....20 సెకన్లు

---------------------------

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ నిర్వహిస్తున్న జ్ఞానభూమి పోర్టల్ కు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. జ్ఞానభూమి పోర్టల్ విద్యార్థులకు రియల్ టైమ్లో సేవలు అందించినందుకు ఈ అవార్డు దక్కిందని ఆ శాఖ నిన్న ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 28న ఢిల్లీలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ బి. లావణ్యవేణి ఈ అవార్డును అందుకుంటారని తెలిపింది.

=====================